# ధాన్యం కొనుగోళ్లపై మంత్రి నిర్లక్ష్యం

**పాత స్టాక్ తొలగింపులో వైఫల్యమే రైతుల ఇబ్బందులకు కారణం**

**వడ్లు, మక్కలు, పొద్దుతిరుగుడు ౹ వెంటనే కొనుగోలు చేయాలి**

**హుస్నాబాద్‌లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది**

**కలెక్టర్ ఆధ్వర్యంలో తక్షణమే రివ్యూ నిర్వహించాలి**

**కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే రైతుల ఆగ్రహం తప్పదు**

**బీఆర్ఎస్ హయాంలో ప్రతి గింజను కొనుగోలు చేశాం**

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయించడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ఆరోపించారు.సోమవారం హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర పారాబాయిల్డ్ మిల్లుతో పాటు సమీపంలోని పలు రైస్ మిల్లులను ఆయన సందర్శించి ధాన్యం నిల్వలు, కొనుగోళ్ల పరిస్థితిపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం" అంటూ ప్రకటనలు చేసే మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటివరకు ధాన్యం, మక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లపై జిల్లా స్థాయి అధికారులతో కనీస సమీక్ష కూడా నిర్వహించకపోవడం ఆశ్చర్యకరమన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు తమ పంటలను విక్రయించడంలో ఎప్పుడూ ఇబ్బందులు పడలేదని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. గత ఏడాది ధాన్యం నిల్వలు ఇంకా రైస్ మిల్లుల్లోనే ఉండటంతో ప్రస్తుతం కొత్త ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని అన్నారు.మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ పాత స్టాక్‌ను ఖాళీ చేయించడంలో నిర్లక్ష్యం వహించడంతో కొత్త ధాన్యాన్ని మిల్లు యజమానులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రైతులు ఇంత ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ఇతర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు.రోహిణి కార్తె సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు వానాకాలం సాగు పనులకు సిద్ధమవుతున్నప్పటికీ ఇంకా పంట విక్రయించలేకపోవడం దారుణమన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లాలో వడ్లు, మక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ డిమాండ్

హుస్నాబాద్,జనత న్యూస్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో (గూాజూూ) కేసులో నిష్పాక్షిక విచారణ జరగాలంటే ఆయనను తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నాయకుడు వొడితల సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసుపై తీవ్రంగా స్పందించారు.దేశంలో ఒక కేంద్ర మంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీసులు జారీ కావడం బహుశా ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన కుమారుడిని కేంద్ర మంత్రి తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టారని, ఇటువంటి వారు అధికారిక పదవుల్లో కొనసాగడం దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి అవమానకరమని విమర్శించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్తున్న 'బేటీ బచావో.. బేటీ పఢావో' నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.




### సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కుమ్మక్కయ్యారు

మైనర్ బాలికకు అన్యాయం చేసిన నిందితుడిని వెనుకేసుకుంటూ, బాధితురాలి తల్లిదండ్రులను కేంద్ర మంత్రి స్వయంగా పిలిపించి భయభ్రాంతులకు గురిచేశారని సతీష్ కుమార్ ఆరోపించారు. ఇంతటి తీవ్రమైన కేసును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కలిసి నీరుగార్చే ప్రయత్నం చేశారని విమర్శించారు. హనీ ట్రాప్ అంటూ మీడియా గొంతు నొక్కి, వార్తలు రాకుండా మనీ ట్రాప్‌కు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఏ ఆడపిల్ల కూడా బయటకు వచ్చి ఫిర్యాదు చేసే ధైర్యం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్ శ్రేణుల పోరాటంతోనే లొంగుబాటు

అధికార పక్షాల నుండి ఎన్ని ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినా లొంగకుండా బాధితురాలి తల్లిదండ్రులు ధైర్యంగా నిలబడ్డారని సతీష్ కుమార్ కొనియాడారు. బాధితురాలికి న్యాయం జరగాలని బీఆర్ఎస్ మహిళా విభాగం, విద్యార్థి సంఘాలు, సోషల్ మీడియా వారియర్స్ గట్టిగా పోరాడాయని తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా కమిషన్, డీజీపీలను కలిసి నిలదీశారని గుర్తుచేశారు. ఈ ఉమ్మడి పోరాటాల ఫలితంగానే నిందితుడు చివరకు లొంగిపోవాల్సి వచ్చిందని, బాధితురాలికి కొంతవరకు న్యాయం జరిగే పరిస్థితి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కేవలం లొంగుబాటుతో సరిపెట్టకుండా, కేంద్ర మంత్రిని పదవి నుంచి తొలగించి పూర్తి నిష్పాక్షిక విచారణ జరపాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి కి ఘన స్వాగతం



జనత న్యూస్ బెజ్జంకి :మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మెన్ గా నియమితులై మొదటి సారి కరీంనగర్ కు వస్తున్న బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి కి మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఘనస్వాగతం పలికారు. ఇందులో భాగంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వివిధ కులాలకు కార్పొరేషన్ లను ఏర్పాటు చేశారని, అందులో భాగంగా నాపై విశ్వాసంతో మున్నూరు కాపు కార్పొరేషన్ కు ఛైర్మెన్ గా నియమించారని ఆయన అన్నారు. నియామకానికి సహరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కు టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మున్నూరు కాపు సంఘ నాయకులు, కులబాంధవులు పాల్గొన్నారు.

# వడ్లూర్ గ్రామపంచాయతీకి మైక్ సెట్ వితరణ



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూరు గ్రామపంచాయతీ కార్యాలయానికి హైదరాబాద్ కు చెందిన దాత సర్దార్ బచ్చన్ సింగ్ గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అంప్లై ఫైర్ 2 మైక్ లను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాతను గ్రామస్తులతో కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'మన ఊరు మన బడి' పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి




హుస్నాబాద్, జనత న్యూస్: 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలకు చెందిన కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ఈ వినతిపత్రాన్ని అందజేశారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్లు, విద్యా కమిటీ చైర్మన్లు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఆరు నెలల పాటు బిల్లులు చెల్లించకపోగా, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 25 నెలలు గడిచినా ఇప్పటికీ బిల్లులు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పనులు పూర్తి చేసేందుకు కొందరు భూములు, నగలు విక్రయించారని, మరికొందరు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే తాము అభివృద్ధి చేసిన పాఠశాలలకు తాళాలు వేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు.వినతిపత్రం సమర్పించిన వారిలో గునుకుల మాధవ్‌రెడ్డి, జనగామ శ్రీనివాసరావు, ఎం. సంపత్‌రావు, కె. మధుసూదన్‌రెడ్డి, పొన్నబోయిన శ్రీనివాస్, కర్ర మనోహర్, కే. రామచంద్రారెడ్డి, బి. తిరుపతిరెడ్డి, వి. శంకర్, సత్యనారాయణ, సతీష్, సాంబరాజు తదితరులు ఉన్నారు.

# పద్మశాలి బడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేయాలి

### రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన గూడూరి శ్రీనివాస్‌కు హుస్నాబాద్ నాయకుల ఘన సన్మానం

హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కో ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన గూడూరి శ్రీనివాస్‌ను హుస్నాబాద్‌కు చెందిన పలువురు పద్మశాలి నాయకులు సిద్దిపేటలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ద్వారా పద్మశాలి కులాలకు చెందిన బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు.గూడూరి శ్రీనివాస్‌కు రాజకీయంగా విశేష అనుభవం ఉందని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజుల భగవాన్ నేత, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర సలహాదారు చింతకింది శ్రీనివాస్, హుస్నాబాద్ మండల కార్యదర్శి గోలి నారాయణ, మార్కండేయ దేవాలయ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి లక్ష్మయ్య, ప్రచార కార్యదర్శి చిలుక రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య భీమాపై అవగాహన ర్యాలీ ప్రారంభం

**స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**




కరీంనగర్, మే 19: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య భీమాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, రోడ్డు భద్రతా నియమాలపై చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేక ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భీమా అవసరమని తెలిపారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆరోగ్య భీమా ఆర్థిక భరోసాను కల్పిస్తుందని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. నగరంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ర్యాలీలో ఆరోగ్య భీమా ప్రాముఖ్యత, సురక్షిత డ్రైవింగ్ అవసరంపై ప్రజలకు సందేశాలు అందించారు. పాల్గొన్న సభ్యులు ప్లకార్డులు, బ్యానర్లతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సీనియర్ ఏరియా మేనేజర్ కుమార్ గోపు, కదర్ల శ్రీనివాస్, మాదాసు సాగర్, చిలుకూరి రమేష్, యేడెల్లి శ్రీనివాస్, సంస్థ సిబ్బంది, ఏజెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## వడ్లలూరు ట్రాక్టర్లు ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



జనతా, న్యూస్ తిమ్మాపూర్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్, రామకృష్ణ కాలనీ గ్రామాల మధ్య రాజీవ్ రహదారిపై దాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను కరీంనగర్ వైపు వెళ్తున్న కరీంనగర్ వన్ డిపో ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి జరిగిన

ఈ ప్రమాదంలో మన్నెంపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కామెర నిరంజన్ కు స్వల్ప గాయాలు కాగా 108 లో ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు ఎల్ఎండి పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు.

## 'ప్రజావాణి'లో 269 దరఖాస్తులు

**అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, మే 19: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 187 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 56 దరఖాస్తులు, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 26 దరఖాస్తులు అందాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 269 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

# జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**రైతుల ఖాతాల్లో రూ.237 కోట్లు జమ**

**వారంలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు రికార్డు**




కరీంనగర్, మే 17: కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ. 237 కోట్లు జమ చేసినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా సంఘాల ప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ కొనసాగుతోందన్నారు. ఈ సీజన్‌లో 3.61 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3 లక్షల ఒక వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని, అందులో ఒక లక్ష 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లను కూడా సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హమాలీల కొరత ప్రధాన సమస్యగా ఉందని, స్థానిక హమాలీలను ప్రోత్సహించి సమస్యను అధిగమించాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు రాకుండా ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించాలని కోరారు. లోడ్ అయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. మిల్లర్లకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, అదే విధంగా మిల్లర్లు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోళ్లలో రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉన్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 78 శాతం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తయిందని, 88 శాతం ధాన్యాన్ని మిల్లర్లు స్వీకరించారని వెల్లడించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, పౌరసరఫరాల సంస్థ డీఎం రజనీకాంత్, రైస్ మిల్లర్లు, రవాణా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బన్సల్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ డిమాండ్**

కరీంనగర్, మే 19: అనుమతులు లేకుండా ఇతర పేర్లతో అడ్మిషన్లు చేపడుతున్న బన్సల్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తప్పుడు ఫలితాలు చూపించి విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేసిన బన్సల్ కళాశాల యాజమాన్యం అనంతరం కళాశాల బోర్డు తొలగించి ఇప్పుడు ఇతర పేర్లతో మళ్లీ అడ్మిషన్లు చేపడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఫలితాల అనంతరం కళాశాల మూతపడటంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలు దెబ్బతినడానికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించిన యుగంధర్, జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫలితాల తర్వాత కళాశాల పేర్లు మార్చి తిరిగి అడ్మిషన్లు చేపడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బన్సల్ కళాశాల యాజమాన్యంపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చంచల మురళి, పినమల్ల భాస్కర్, వినయ్ రాజు తదితరులు పాల్గొన్నారు.










## హుస్నాబాద్‌లో క్రీడా వారోత్సవం ప్రారంభం





హుస్నాబాద్,జనత న్యూస్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే 18 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న క్రీడా వారోత్సవాలను పురస్కరించుకుని హుస్నాబాద్‌లో ఆదివారం 2కే మారథాన్ రన్ నిర్వహించారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంతో పాటు ఫిజికల్ లిటరసీపై అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి మినీ స్టేడియం వరకు ఈ మారథాన్ చేపట్టినట్లు మండల విద్యాధికారి బండారి మనీలా తెలిపారు. మారథాన్‌ను కాంప్లెక్స్ హెచ్ఎం కె. వాసుదేవ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పీఎం శ్రీ బాలికల పాఠశాలలో క్రీడాకారులకు యోగ, ధ్యానం, యోగాసనాలపై పీడీ ఆర్. శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బాలికల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం గంగిశెట్టి మహేందర్, పీడీలు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, బ్యాడ్మింటన్ కోచ్ దిలీప్ ఠాకూర్, కబడ్డీ కోచ్ కృష్ణ, ఉపాధ్యాయుడు రవి, సీనియర్ క్రీడాకారుడు రిశ్వంత్‌తో పాటు పలువురు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ బీఆర్ఎస్ నిరసన

**తెలంగాణ చౌక్‌లో ఉద్రిక్తత**




కరీంనగర్, మే 19: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో భారీ ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మైనర్ బాలికకు న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఫ్లెక్సీ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఫ్లెక్సీని పోలీసులు బలవంతంగా లాక్కోవడంతో బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడ అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బండి సంజయ్ మంత్రిగా కొనసాగితే మైనర్ బాలికకు న్యాయం జరగదని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే ప్రధాని నరేంద్రమోదీ ఆయన్ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని కోరారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com